క్లుప్తంగా

వాహనాల తనిఖీ

రెంజల్(బోధన్): సాటాపూర్ చౌరస్తాలో పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని 5 ద్విచక్ర వాహనాలను జప్తు చేసి ఆర్టీవో అధికారులకు అప్పగించారు. వాహనదారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని నంబర్ ప్లేటు ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్సై బాబూరావ్ సూచించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. లేని పక్షంలో వాహనాలను జప్తు చేసి ఆర్టీవోకు అప్పగిస్తామని చెప్పారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు




రుద్రూర్: రాణంపల్లి, సులేమాన్‌నగర్ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు మంగళవారం ఎస్‌డీఎఫ్ నిధులతో బోరు డ్రిల్లింగ్ చేయించారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా బోరును డ్రిలింగ్ చేయించినట్లు స్థానిక నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహ్మద్ గౌస్, రాయకూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు తోట సంగయ్య, గంగారాం పటేల్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదవాలి



ఎడపల్లి(బోధన్): విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని, అనవసర ఆందోళన పడవద్దని విశ్రాంత అధ్యాపకులు, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే కఠిన సాధన చేయాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. మనసును నిర్మలంగా ఉంచుకొని ఏకాగ్రతతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చునన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే ఏదైనా సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుహాసిని రెడ్డి, ఏవో కృష్ణ మోహన్ తదితరులున్నారు.

అధికారి పేరు మార్చరా ?



ఆర్మూర్‌టౌన్: ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం–2005 బోర్డును సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. ఆ శాఖకు సంబంధించిన సమాచారం కోసం అప్పిలేట్ అధికారికి ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కాని ఇక్కడ సమాచారం హక్కు చట్టం బోర్డుపై అప్పిలేట్ అధికారి పేరు ఇంతకు ముందు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ప్రసాద్‌చౌహన్ పేరు ఉంది. పాత కమిషనర్ బదిలీ అయి నెలరోజు అవుతున్నా పేరు తొలగించి కొత్త మున్సిపల్ కమిషనర్ రాజు పేరు రాయకపోవడం గమనర్హం. ఇప్పటికైనా అధికారులు పాత కమిషనర్ పేరు మార్చి కొత్త కమిషనర్ పేరును సమాచార హక్కు చట్టం బోర్డు రాయాలని కోరుతున్నారు.

నర్సరీలకు గ్రీన్ షెడ్‌లను ఏర్పాటు చేయాలి



రెంజల్(బోధన్): నర్సరీలకు గ్రీన్ షెడ్‌లను ఏర్పాటు చేసి మొక్కలను ఎండ నుంచి సంరక్షించాలని ఎంపీడీవో శంకర్ సూచించారు. మండలంలోని బోర్గాం, తాడ్‌బిలోలి, మౌలాలి తండా గ్రామాల్లో మంగళవారం పర్యటించి నర్సరీలను, జీపీల రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల కార్యదర్శులకు సూచించారు. జీపీల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్ కార్యదర్శులు ఉన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

కమ్మర్‌పల్లి: మండలంలోని ఆయా పాఠశాలల్లో మంగళవారం తపస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని 80 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, మండలాధ్యక్షుడు సల్లూరి కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పూర్తయ్యేనా..?

- బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- తొండాకూర్ వద్ద రూ.2.30 కోట్లతో నిర్మాణం



తొండాకూర్ వద్ద నిలిచిపోయిన వంతెన పనులు

డొంకేశ్వర్(ఆర్మూర్): తొండాకూర్–కుద్వాన్‌పూర్ గ్రామాల నడుమ నిర్మిస్తున్న వంతెన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో స్లాబు వరకు నిర్మించి వదిలేశాడు. బిల్లులు వస్తేగాని మిగతా పనులు చేయనని అధికారులకు స్పష్టం చేశాడు. దీంతో వంతెన పూర్తికావడం ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వర్షాలు కురిసినప్పుడల్లా ఎగువ ప్రాంతం నుంచి వాగు ప్రవహించి తొండాకూర్ వద్ద బీటీ రోడ్డు కోతకు గురవుతోంది. దీనివల్ల పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. నీటి ప్రవాహానికి భారీ గుంత ఏర్పడడంతో గతేడాది నందిపేట్‌కు చెందిన యువకుడు వాహనంపై వెళ్తా ప్రమాదవశాత్తు పడి మరణించాడు. వాగు కారణంగా ప్రమాదాలే కాకుండా రోడ్డు, పంట పొలాలకు నష్టం జరగకుండా వంతెనను నిర్మించడానికి ప్రభుత్వం రూ.2.30 కోట్లు ఆర్‌అండ్‌బీ శాఖకు మంజూరు చేసింది. టెండరు దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ చకచకా స్లాబు వరకు పనులు పూర్తి చేశాడు. ఐతే, 70 శాతం పనులు పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదు. సైడ్ వాల్స్, ఇతర పనులతో పాటు వంతెన ఎత్తుకు తగ్గట్లుగా రోడ్డును వేయకుండా అలాగే వదిలేశాడు. దీంతో వాహనదారులకు బ్రిడ్జి అందుబాటులోకి రాలేదు. ఇటు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి బిల్లులు సమర్పించినప్పటికీ అవి మంజూరు కావడం లేదు. బిల్లులు వస్తేగాని మిగతా పనులు చేయనని కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో అధికారులకు ఇబ్బందిగా మారింది.

నికాల్‌పూర్‌లో మొదలుకాని పనులు

నికాల్‌పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో కెనాల్ మీదుగా ఉన్న పాత వంతెన ఇరుకుగా, ప్రమాదకరంగా మారింది. ఇక్కడ వెడల్పుతో కూడిన కొత్త వంతెనను నిర్మించడానికి ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.75 లక్షలు మంజూరు చేసింది. టెండరు కూడా పూర్తి కాగా ఇంత వరకు పనులు మొదలు కాలేదు. పనులు చేపట్టేందుకు అప్రోచ్ రోడ్డు వేసి వదిలేశాడు. ఈ కాంట్రాక్టర్‌కు కూడా వేరే చోట చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోడంతోనే నికాల్‌పూర్ వద్ద వంతెన పనులు ప్రారంభించడం లేదని తెలుస్తోంది.

బిల్లులు త్వరగా వచ్చేలా చూస్తాం

ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి సమర్పించాం. తొండాకూర్ వద్ద నిర్మించిన వంతెనకు రూ.కోటి వరకు బిల్లులు పెట్టాం. కాంట్రాక్టర్‌కు త్వరగా బిల్లులు వచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతాం. అలాగే నికాల్‌పూర్ వద్ద త్వరలోనే కొత్త వంతెన నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు చేపడుతాం. – రఘు, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

పథకాల వివరాలు ప్రజాప్రతినిధులకు చెప్పాలి

- అధికారుల నిర్లక్ష్యంపై జెడ్పీటీసీ ఆగ్రహం
- మోస్రా మండల సభలో పలు సమస్యల ప్రస్తావన



మాట్లాడుతున్న ఎంపీపీ పిట్ల ఉమ

వర్ని(మోస్రా): ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి అవగాహన కల్పించాలని, ఈ విషయంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మోస్రా జెడ్పీటీసీ గుత్ప విజయభాస్కర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మోస్రా మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిట్ల ఉమ అధ్యక్షతన నిర్వహించారు. విద్యాశాఖలో మానసికంగా అంగవైకల్యం ఉన్న విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయించాలన్న విషయాన్ని ఎంఈవో శాంత కుమారి మండల, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు తెలియజేయలేదని మండిపడ్డారు. ఏ శాఖలో అయినా ప్రతి సంక్షేమ పథకం వివరాలను, విధివిధానాలను మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని లేకపోతే వారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ధరణిలో ఏవైనా సమస్యలుంటే రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపించాలని ఎంపీపీ ఉమ, జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి సూచించారు. అలాగే పలు సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సాయిలు, ఎంపీడీవో ప్రవీణ్ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పాత బకాయిలు చెల్లిస్తేనే లెప్రసీ సర్వే చేస్తాం



వర్ని(మోస్రా): ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో చేసిన సర్వేలకు బకాయి ఉన్న వేతనాలను చెల్లించే వరకు కొత్తగా లెప్రసీ సర్వే చేయబోమని ఆశా కార్యకర్తలు స్పష్టం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మోస్రా మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పాత బకాయిలు చెల్లించకుండా కొత్త సర్వేలు చేయించడం ఆశా కార్యకర్తల శ్రమదోపిడీకి నిదర్శనమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నేసాబ్ ఆరోపించారు. పురుషుడిని పరిశీలించడానికి మగ వాలంటీర్‌ను నియమించాలని కోరారు. ఆశా యూనియన్ అధ్యక్షులు ఆసియా, సాత్విక, తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో వ్యవసాయ రంగం నాశనం

- ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్



మాట్లాడుతున్న ప్రభాకర్ తదితరులు

ఆర్మూర్: ఎన్నికల సమయంలో వ్యవసాయ రంగానికి రెండింతలు లాభం చేకూర్చుతానన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక నాలుగు వ్యవసాయ రంగ వ్యతిరేక చట్టాలతో వ్యవసాయ రంగాన్నే నాశనం చేశారని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ ఆరోపించారు. ఆర్మూర్ పట్టణంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని కాపాడడానికి దేశంలో ఉన్న 250 రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తున్న విషయం తెలిసిందేనన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా సంయుక్త కిసాన్ మంచ్ పిలుపు మేరకు జాతీయస్థాయిలో ఈ నెల 14న రైతు మహా పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, ప్రధాన కార్యదర్శి జి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



కమ్మర్‌పల్లి: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లిలోని కేజీబీవీని డీఈవో సందర్శించారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రిఫైనల్ ఫలితాలను పరిశీలించారు. ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో ఆంధ్రయ్య, ప్రత్యేకాధికారి గంగామణి ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆర్టీసీ కాలనీ వినాయక ఆలయ 7వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవానికి విరాళాలు ఇచ్చిన కాలనీవాసులకు, వార్డు కౌన్సిలర్ వర్ధిని సత్యంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నరసింహస్వామి ఆలయం..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో గురడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న సంఘం సభ్యులు

హైదరాబాద్ తరలిన మహిళా సంఘాల ప్రతినిధులు



సాక్షి నెట్‌వర్క్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సదస్సుకు జిల్లా నుంచి మహిళా సంఘాల ప్రతినిధులు భారీగా బయలుదేరి వెళ్లారు. ఆయా మండలాల్లో స్థానిక అధికారులు, నేతలు జెండాలను ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. ఆర్థిక స్వాలంబన సాధించటానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మహిళ శక్తి పథకం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

విజయ సంకల్ప సమ్మేళనానికి బీజేపీ శ్రేణులు



ఉమ్మడి బాల్కొండ నుంచి వెళ్తున్న నేతలు



మోర్తాడ్, ఏర్గట్ల మండలాల నుంచి..

ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన విజయ సంకల్ప సమ్మేళనంలో పాల్గొనేందుకు బాల్కొండ, ముప్కాల్, మెండోరా, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల నుంచి భారీగా బీజేపీ నాయకులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఈ సమ్మేళనానికి కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా హాజరు కానున్న విషయం తెల్సిందే. సమ్మేళనానికి ముందు హైదరాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో మీటింగ్‌లో పాల్గొని వారికి దిశా నిర్దేశం చేయనున్నారని నేతలు చెప్పారు. – బాల్కొండ/మోర్తాడ్

స్వయం పాలన దినోత్సవం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్వయం పాలన దినోత్సవం నిర్వహించడం వల్ల విద్యార్థులకు పాలనాపరమైన అంశాలపై అవగాహన కలుగుతుందని హెచ్‌ఎం లక్ష్మీనారాయణ అన్నారు.

చురుకుగా పారిశుధ్య పనులు

మోర్తాడ్: మోర్తాడ్‌లో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్మికులు వీధులను శుభ్రం చేసి మురికి కాలువల్లోని చెత్తను తొలగించారు. దోమల బెడద నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కార్యదర్శి రామకృష్ణ వెల్లడించారు.

కనుల పండువగా రథోత్సవం



ఎడపల్లి(బోధన్): కుర్నాపల్లి ఉమా మహేశ్వర ఆలయ మహాశివరాత్రి జాతర మహోత్సవాలను గ్రామ ప్రజలు కనుల పండువగా నిర్వహించారు. ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సురేందర్ రెడ్డి, స్థానిక నాయకులు దుబ్బాక రవీందర్ గౌడ్‌లు మాట్లాడుతూ.. మహాశివరాత్రి అనంతరం ఐదు రోజులకు ఉమామహేశ్వర ఆలయంలో రథోత్సవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. అన్నదానం కూడా నిర్వహించామన్నారు.

సీఏఏ ముస్లింలకు వ్యతిరేకం కాదు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ముస్లింలకు వ్యతిరేకం కాదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సీఏఏను అమలు చేస్తూ గెజిట్‌ను విడుదల చేయడాన్ని పురస్కరించుకుని ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం బీజేపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2014 డిసెంబరు 31వ తేదీకి ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ దేశాల్లో మతపరమైన హింసను భరించలేక భారత దేశానికి వలస వచ్చిన హిందువులు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, సిక్కులకు పౌరసత్వం కల్పించడానికి మాత్రమే సీఏఏను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భారత దేశం సురక్షితంగా ఉండాలంటే సీఏఏను అమలు చేయాల్సిందేనన్నారు. అలాగే తెలంగాణలో సైతం సీఎం రేవంత్ రెడ్డి సీఏఏను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆర్మూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, ఉపాధ్యక్షుడు దోండి ప్రకాశ్, పల్లె శ్రీనివాస్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి

వర్ని(మోస్రా): గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను కాంట్రాక్టర్ నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని మోస్రా జెడ్పీటీసీ విజయభాస్కర్ రెడ్డి సూచించారు. మంగళవారం గోవూరులో నూతనంగా ఏర్పాటు చేసిన డబుల్ బెడ్‌రూం కాలనీలో తాగునీటి పైప్ లైన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని, శాశ్వతంగా ఉండే పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఎంపీపీ పిట్ల ఉమా, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీరాములు, బీఆర్‌ఎస్ పార్టీ మోస్రా మండల అధ్యక్షులు హనుమంతు రెడ్డి, గోవూరు సహకార సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కత్తి సాయిలు పాల్గొన్నారు.

సిండికేట్ మాయాజాలం.. వేలం వాయిదా

- నవీపేట సంతలో అధికారుల ప్రేక్షక పాత్ర



వేలంపాటపై చర్చిస్తున్న అధికారులు

నవీపేట: నవీపేట మేజర్ జీపీకి ఆదాయాన్ని సమకూర్చే మేకలు, కూరగాయల సంతలకు మంగళవారం వేలం పాటలు నిర్వహించగా సిండికేట్ మాయాజాలంలో వాయిదాపడ్డాయి. జీపీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో నాగనాథ్ ఆధ్వర్యంలో ఈ వేలం పాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మేకల సంత వేలానికి రూ. లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించిన 28 మంది వేలంలో పాల్గొన్నారు. అలాగే వారాంతపు కూరగాయల సంత వేలంలో పాల్గొనేందుకు 10 మంది రూ. లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించారు. వేలం ప్రారంభవగానే పాత గుత్తేదారులు సిండికేట్ బాణాన్ని ప్రయోగించారు. దీంతో ఉత్సాహంగా పోటీనిస్తారని భావించిన తోటి పోటీదారులు సిండికేట్‌కు 'సై' అన్నారు. గతేడాది రూ. 55,16,000లకు పలికిన మేకల సంత వేలం ఈసారి సిండికేట్ మాయాజాలంలో రూ.39 లక్షల వద్దే నిలిచిపోయింది. అలాగే గతేడాది రూ.15 లక్షలు పలికిన వారాంతపు కూరగాయల సంత ఈసారి రూ.లక్ష వద్దే నిలిచిపోయింది. డిపాజిట్ చెల్లించిన ఔత్సాహికులు వేలం ప్రారంభమవగానే బయటకు వెళ్లి బహిరంగంగా పర్సంటేజీలు మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ తతంగాన్ని చూస్తున్న అధికారులు, పోలీసులు చొరవ తీసుకోకపోవడం కొసమెరుపుగా మారింది. ఆశించిన ఆదాయం రాలేదని 14కు వాయిదా వేసి ఉద్యోగ ధర్మాన్ని పాటించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



మోతె శ్రీనివాస్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొద్దుటూరి వినయ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెర్కిట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి సమక్షంలో ఆలూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మోతె శ్రీనివాస్ రెడ్డి, తిర్మన్‌పల్లి వంశీ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, కుంట నారాయణ, బార్ల ముత్యం, పెండ ఉదయ్, తిర్మన్‌పల్లి నవనీత్, పెండ భాస్కర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్ నుంచి..

నందిపేట్ (ఆర్మూర్): సిద్ధాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి 20 మంది మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు మంద మహిపాల్, తొంటి నరేష్ ఆధ్వర్యంలో వినయ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సిద్ధాపూర్ మాజీ ఉపసర్పంచ్ రమేష్, వీడీసీ చైర్మన్ కార్తీక్, సాయి, బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సభ్యుడు ఆర్.గంగారెడ్డి, ఆర్.శ్రీనివాస్, ఆంజనేయులు, గంగారాం, ఊషన్న, దేవన్న తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ప్రభుత్వ పథకాలు, ఇచ్చిన హామీల అమలు చేస్తుండటంతో ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

ఆలయ ప్రహరీ కోసం నిధులు మంజూరు చేయాలి



వినయ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కుద్వాన్‌పూర్ గ్రామస్తులు

నందిపేట్ (ఆర్మూర్): కుద్వాన్పూర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రహరీ కోసం నిధులు మంజూరు చేయించాలని వినయ్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సయ్య, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి మల్కారెడ్డి, కోశాధికారి సాయన్న పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి జాతర



వేల్పూర్: మండల కేంద్రంలో మంగళవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జాతర వైభవంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేదపండితులు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పూర్‌తో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవం కనుల పండువగా జరిగింది. జాతరకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	బులెట్ (తెలుగు) – 10.25
	సైతాన్ (హిందీ) – 1.15, 7.00
	బాబు (తెలుగు) – 4.15
	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) – 10.00
స్క్రీన్-2 –	గామి (తెలుగు) – 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 –	భీమా (తెలుగు) – 12.30, 3.35, 6.40, 9.45